### కాంగ్రెస్ పార్టీ 'గ్యారెంటీలు'

# బీఆర్ఎస్ సంక్షేమ పథకాల కాపీ

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో 'గ్యారెంటీలు' చిత్తు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మం నగరంలో విలేకర్ల సమావేశం

ఖమ్మం, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టి కాంగ్రెస్ పార్టీ వాటినే తమ ఆరు గ్యారంటీ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నదని రాష్ట్రరవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, ఆసరా పింఛన్లను కాపీ కొట్టిన విషయం నిజం కాదా.. అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో పింఛనుదారులకు కేవలం రూ.200 పింఛను ఉండేదని, తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పింఛనును రూ.2,016కు పెంచారన్నారు. దేశంలోనే తొలిసారి రైతుబంధు పథకాన్ని అమలు చేసింది ఒక్క కేసీఆరేనన్నారు. ఇప్పుడు ఎవరు ఏ పథకాన్ని అమలు చేస్తున్నారో రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీములు చిత్తయ్యాయన్నారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కేసీఆర్ మున్ముందు రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ బీమా సౌకర్యం కల్పిస్తారన్నారు. సంక్షేమ పథకాలను మళ్లీ అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి శషభిషలు లేవన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కేసీఆర్ గతంలో ఎన్నోసార్లు మెచ్చుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కరోనా వంటి సంక్షోభం వచ్చినప్పుడు కూడా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను కొనసాగించారని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014, 2018 ఎన్నికల ఫలితాలకు భిన్నంగా ఫలితాలు ఉండబోతున్నాయని స్పష్టం చేశారు. ఇక్కడి పదికి పది అసెంబ్లీ స్థానాలూ బీఆర్ఎస్సే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన స్థానాలను పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమన్నారు. ప్రత్యర్థులు ఇంకా క్యాండెట్లను నిర్ణయించుకునే స్థితిలోనే ఉన్నారని, కానీ బీఆర్ఎస్ మాత్రం ఇప్పటికే అభ్యర్థులకు బీ ఫారాలు ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలోనూ దూసుకుపోతున్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కదన రంగంలోకి దూకాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు అందగా ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే లక్షన్నర ఎకరాలకు పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేని పనిని సీఎం కేసీఆర్ చేసి చూపించారని కొనియాడారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, బీఆర్ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి కమల్‌రాజు, బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్, నగర మేయర్ నీరజ, స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

#### కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీ నాయకులు చెపుతున్న మాయమాటలను ప్రజలు నమ్మొద్దు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజల బాగోగులు పట్టించుకోని వారు ఇప్పుడు ఎన్నికల్లో గెలిచి ప్రజలకు ఏం చేస్తారు? తెలంగాణలో అమలవుతున్న పథకాలను కేంద్ర ప్రభుత్వమే కాపీ కొడుతున్నది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ స్కీములను తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు జవాబు ఇవ్వాలి.

**- ఎంపీ నామా నాగేశ్వరరావు**

### దుర్గతి నాశిని.. సద్గతిదాయిని

## గజలక్ష్మి నమోస్తుతే..

భద్రాచలం, అక్టోబర్ 17: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం లక్ష్మీతాయారమ్మ గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టోత్తర శత నామార్చన, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. చిత్రకూట మండపంలో అయోధ్యా కాండ పారాయణం చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ, నివేదన, మహా మంత్రపుష్పం, తీర్థ, ప్రసాద గోష్ఠి నిర్వహించారు. అనంతరం తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ చేపట్టారు. కాగా బుధవారం అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## మధిరను సుందరంగా తీర్చిదిద్దుతా

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల**



ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు

మధిర టౌన్, అక్టోబర్ 17: ఎన్నికల్లో గెలిపిస్తే మధిర పట్టణాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలుపుతానని, సుందరంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. పట్టణ పరిధిలో పెద్దచెరువు స్విమ్మింగ్ ఘాట్ వద్ద మంగళవారం ఆయన స్విమ్మింగ్ అసోషియేషన్ సభ్యులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి స్విమ్మర్స్ సమస్యలను ప్రస్తావంచగా లింగాల వాటిపై సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్లపోతుల ప్రసాదరావు, చల్లా సత్యనారాయణ, ఆవుల సంతోశ్‌కుమార్, చుక్క రాంబాబు, సాంబిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, ఊటుకూరు భాస్కర్‌రావు, వేముల నవీన్‌కుమార్, వేముల ఆంజనేయులు, మేడ గోపీనాథ్, కస్తాల సతీష్, కల్యాణపు పున్నయ్య, వట్టే సైదులు, మార్త శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వందనపు శ్రీనివాసరావు, వేమిరెడ్డి రవీందర్‌రెడ్డి, గండూరి రాంబాబు, అమరనేని నవీన్, ఏలూరు దుర్గాప్రసాద్, సుమంత్, యశ్వంత్ పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడతాం

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ, అక్టోబర్ 17: కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టి బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపునకు బాటలు వేస్తామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పాత పాల్వంచలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు నివాసంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బు సంచులతో వచ్చే దొంగలను కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు విశ్వసించరన్నారు. గత ఎన్నికల్లో వనమా చేతిలో ఘోరంగా ఓడిపోయిన జలగం వెంకట్రావ్ ఇప్పుడు ఢిల్లీ, హైదరాబాద్‌లలో కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. జలగం వెంకట్రావ్ గొప్పలకు పోతే సీఎం కేసీఆర్ ఆయన పగటి కలల్ని పటాపంచలు చేశారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేగా వనమాకు సీఎం కేసీఆర్‌కు ఎనలేని ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. పార్టీ నాయకులు బయట వినిపిస్తున్న పుకార్లు, వదంతులను నమ్మొద్దని సూచించారు. సంపద సృష్టించి పేదలకు పంచడమనే గొప్ప ఆశయంతో కేసీఆర్ పాలన సాగించారని, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.3 వేల కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. వచ్చే నెల 5న కొత్తగూడెంలో జరిగే సీఎం కేసీఆర్ సభకు భారీగా జన సమీకరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ దామోదర్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సర్దార్ పుటం పురుషోత్తం రావు, కొత్వాల శ్రీనివాసరావు, రాంబాబు, వాసుదేవరావు, కాసుల వెంకట్, జేవీఎస్ చౌదరి, రాజు గౌడ్, హనుమంతరావు, రజాక్, బత్తుల వీరయ్య, సోమిరెడ్డి పాల్గొన్నారు.

## ఒక్కసారి ఆశీర్వదించండి.. అభివృద్ధికి బాటలు వేస్తా

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు**



ఎన్నికల ప్రచారంలో తెల్లం వెంకట్రావు

వెంకటాపురం అక్టోబర్ 17: ఏజెన్సీవాసిగా తనకు భద్రాచలం నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని, ఒక్కసారి ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధికి బాటలు వేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లం మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ గెలుపునకు బాటలు వేస్తాయన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జజ్జరి నారాయణమ్మ, బొల్లె లలిత, ఆలుబాక సర్పంచ్ ఆదిలక్ష్మి ఉన్నారు.

## బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి, అక్టోబర్ 17: మండలంలోని రామచంద్రుని పేట, తోలెరామయ్య గుంపు, మొరుట్ల, రామచంద్రునిపేట, బోడు, కొప్పురాయి గ్రామాల్లో మంగళవారం గ్రామస్తులు నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పాల్గొన్నారు. బతుకమ్మతో కలిసి ఆడి పాడారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, బోడ బాలూనాయక్, చీమల సత్యనారాయణ, బానోత్ కిషన్, బానోత్ రామా, బాలాజీ, సర్పంచ్‌లు ఈసాల ఉపేందర్ బాబు, ఇర్ప లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ అప్పారావు, నాయకులు మౌలానా, జాటోత్ నరేష్, ఉండేటి బసవయ్య, శ్రీనివాసరాజు, రవి, గుగులోత్ కృష్ణ, శ్రీను, లచ్చు, లావుడ్యా నరేష్, భద్రం పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలో ఎమ్మెల్యే హరిప్రియ

## ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలి

**ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**

మామిళ్లగూడెం, అక్టోబర్ 17: ప్రభుత్వ అధికారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు ఉంటాయన్నారు. ఒకరికి ఎక్కువ, ఒకరికి తక్కువ ఉండవని స్పష్టం చేశారు. ఒక శాసనసభ నియోజకవర్గానికి ఒక అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షలలోపు ఖర్చు చేయవచ్చన్నారు. సమావేశాలు, సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల పంపిణీ, ప్రచార ప్రకటనలు, వీఐపీలు పాల్గొనే బహిరంగ సభలకయ్యే ఖర్చులను నిశితంగా పరిశీలించాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల ఖర్చు లావాదేవీల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఫ్లెక్సీలపై ముద్రణదారుల ఫోన్‌నంబర్ ప్రింట్ చేయాల్సిందేనన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం ప్రభావం ఉండకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, సహాయ శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా సహకారశాఖ అధికారిణి విజయకుమారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల పాల్గొన్నారు.

**ఎన్నికల కంట్రోల్ రూం తనిఖీ..**

నూతన కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను మంగళవారం కలెక్టర్ వి.పి.గౌతమ్ తనిఖీ చేశారు. కంట్రోల్ రూంతోపాటు సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు అందిన ఫిర్యాదులపై సిబ్బందిని ఆరా తీశారు. సీ విజిల్ యాప్ ద్వారా 72 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 343 కాల్స్ వచ్చాయని సిబ్బంది బదులిచ్చారు. వాటిని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, సీపీవో ఎ.శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616